# శత్రువు

పాలడుగు వెంకటేశ్వర రావు

ఈ మధ్యన సుబ్రమణ్యానికి ఆఫీసులో పని ఎక్కువయింది. ప్రక్కసీటు పున్నారావు సెలవులో వెళ్ళాడు. అందువలన ఆ సీటు భారం కూడా సుబ్రమణ్యం పైనే పడింది. దానికి తోడు ఆ సమయంలోనే ఆఫీసు ఇన్స్‌పెక్షన్ వచ్చింది. అందువలన ఎంతగా బ్రైండు చెడగొట్టుకుని, చేతులు విరగ్గొట్టుకున్నా, పని పేరుకు పోయింది. పైనుంచి వత్తిడి ఎక్కువయింది.

ఆ రోజు ఆఫీసరు సుబ్రమణ్యాన్ని పిల్చి చెడామడా తిట్టాడు. ఆ సమయంలో సూపర్నెంటు కూడా అక్కడ్నే నిలబడి వున్నాడు. కానీ – ఆఫీసరు అంతగా మీద పడి తనని విరుచుకుని తింటుంటే సూపర్నెంటు వక్క మాట కూడా నోరు తెరిచి అనలేదు. తనకు సపోర్టుగా ముందుకు రాలేదు!

సుబ్రమణ్యాన్కి చిర్రెత్తుకుని వచ్చింది. కోపం బుస్సున పొంగింది. ఎగిరెగిరి పడ్డాడు.

ఆఫీసరు గది నుండి బయటికి రాగానే కుండ బద్దలు గొట్టినట్టు అన్నాడు, సుబ్రమణ్యం.

'నేను ఈ వుద్యోగాన్కి రిజయినిస్తున్నాను. బోడి ముండా వుద్యోగం! పీడాకారి!!'

సూపర్నెంటు సూర్యారావు తెల్ల మొహం వేసి అన్నాడు. 'నిజమేనా?!'.

'ముమ్మాటికీ నిజమే' సుబ్రమణ్యం అన్నాడు.

'అంత తొందర పనికిరాదు సుబ్రమణ్యం. నా మాట విను.' బ్రతిమాలుతున్నట్టు అన్నాడు సూర్యారావు.

"ఎవరిదండీ తొందర? అన్యాయంగా ఆఫీసరు నన్ను అంతంత మాటలన్నాడు! ఈ రోజుల్లో అసలు పనిచేసే వాడికే గుర్తింపు లేదు! 'కాకా' పట్టే వాళ్ళవే రోజులు! నన్నేగదా ఆయన అన్నదీ. కనుక మీదేం పోయిందీ? మిమ్మల్ని అంటే మీకూ తెలిసి వచ్చేది! తనదాకా వస్తే గాని ఎవరికయినా....'

'నిన్నే గాదు సుబ్రమణ్యం! నన్ను కూడా ఆయన అంతకంటే పెద్ద పెద్ద మాటలే, అంటాడు. కావాలనేం అనడు ఆయన. కానీ, ఆ పరిస్థితులు ఆయన చేత అలా అన్పిస్తాయి. అంతే. ఆ తర్వాత వెంటనే ఆయన అంతా మర్చిపోతాడు. ఏదో పకడ్బందీగా పని పూర్తి చేయించాలన్న తపన చేత ఆయన అలా అంటాడు గానీ.... ఆయనా మనలాగే మానవత్వమున్న మనిషే.'

'అవన్నీ నాకనవసరం. నాకు చీమూ నెత్తురూ వున్నాయి. మానం అభిమానం వుంది. నేనూ ఆత్మ గౌరవం గల వక మనిషినే. ఎవరయినా– ఇష్టం వచ్చినట్టు అంటే, పడివుండేది లేదు. రోడ్డు ప్రక్కన కిల్లీ కొట్టు పెట్టుకుంటే ఇంత కంటే ఎక్కువే సంపాదించగలను".

"కావచ్చును గాని అది అందరికీ చేతకాదు సుబ్రమణ్యం! కాస్త ఆలోచించు".

'అంతకీ ఏమిటండీ మీదనేది?! అసలు ఏమిటీ మీ వుద్దేశ్యం?' గర్జించాడు సుబ్రమణ్యం.

'నాయనా! తొందరపడకు. మనలాంటి చిరుద్యోగులకి అంత కోపం పనికి రాదు. నిదానం ప్రధానం'.

'ఓహో! అలా అయితే పరమశాంతంగా పడివుండి. రోజూ ఆయన పిలిచి వడ్డించే దరిద్రపు ఆ వడ్డనల నన్నిటినీ తృప్తిగా భోజనం చేయండి. నేను పోతున్నాను.' అని వెళవెళా 'రిజిగ్నేషన్ లెటరు' రాసి సూర్యారావు మొహాన్న కొట్టి, రొమ్ము విరుచుకుంటూ వీధిన పడ్డాడు సుబ్రమణ్యం– ఆవేశంతో వీరోచితంగా.

అదంతా వింటూవున్న ఆనందరావు అప్పుడే ఆ సంగతి ఆఫీసులో అందర్కీ చెప్పాడు. క్షణాలలో అది ప్రక్క ఆఫీసుల వాళ్ళకి కూడా తెల్సి పోయింది!

చిరాగ్గా ఇల్లు చేరిన సుబ్రమణ్యం వాకిట్లో దుమ్ములో కూర్చుని ఆడుకుంటూ వున్న మూడేళ్ళ పుత్రరత్నాన్ని చూసి చిరాకు పడ్డాడు. వాడు తండ్రిని చూసి నవ్వగా• సుబ్రమణ్యం –'వెధవా! మట్టి వళ్ళంతా అయ్యింది. బుద్ధి లేదూ?' అని అరిచి, 'ధాం ధాం' అని వాడి వీపు మీద రాంఛోలు మోత మ్రోగించాడు! వాడు గొంతెత్తి ఏడ్చాడు!

'అయ్యో! అదేమిటండీ? చంటి వెధవని పట్టుకుని అలా కొట్టారు!' అంటూ పరుగెత్తుకుని వచ్చింది సుబ్రమణ్యం భార్య సుజాత. పసివాడ్ని చంకలోకి తీసుకుంది.

'అసలు నిన్ననాలి! నీకు బుద్ధి అనేది లేదు. శుచీశుభ్రతాలేదు. జ్ఞానం అసలే లేదు' అంటూ ఎగిరెగిరి పడ్డాడు సుబ్రమణ్యం. కళ్ళు ఎర్రగా చేసి తీవ్రంగా చూసాడు.

'సర్లెండి. అలిసిపోయి వచ్చినట్టున్నారు. టీ ఇస్తాను. కాళ్ళు కడుక్కురండి'. అంది సుజాత అనునయ పూర్వకంగా.

'టీ వద్దు. నీ మొహం వద్దు' అంటూ ఆవేశంగా ఎదుట వున్న కుర్చీని తన్నాడు సుబ్రమణ్యం, బలంగా. కుర్చీ మూడు పచ్చీలు కొట్టి ముక్కలయ్యింది. కాలికి గాయమయి ఎర్రగా నెత్తురు వచ్చి చిమచిమలాడింది. చురచురమంది.

'అయ్యో! అయ్యో! గాయమయ్యింది. వుండండి. కట్టు కడ్తాను'. అంటూ దగ్గరకు రాబోయిన సుజాతని వక్క తోపు తోసి తిరిగి వీధిన పడ్డాడు సుబ్రమణ్యం.

బజార్లో అందరూ తననే చూసి నవ్వుతున్నట్టని పించింది. గిల్టీ కాన్షస్‌నెస్.

'అదుగో! అతనే • సుబ్రమణ్యం! వుద్యోగం పోయింది. ఇంకేముంది? బజార్న పడ్డాడు. పాపం!' అని గుసగుస లాడుకుంటున్నట్టు అన్పించింది. వాళ్ళు తన గురించే గుసగుసలాడు కుంటున్నట్టన్పించింది.

'ఏంటి సారూ! సింగిల్ టీ ఇమ్మంటారా?' సెంటర్లో చిన్నస్వామి ఆప్యాయంగా అడిగాడు. రోజూ సాయంత్రాలు అక్కడ టీ తాగుతాడు సుబ్రమణ్యం.

అతన్ని సుబ్రమణ్యం కొరకొరా చూసి 'టీ వద్దు నీ బొందావద్దు' అన్నాడు కోపంగా.

'ఏంటండోయి సారూ! టీ తాగితే తాగారు. లేకోతే లేదుగాని మాటలు జాగ్రత్తగా రానీండి మరి!' అని




హెచ్చరించాడు చిన్నస్వామి, చిన్నవుచ్చుకుని.

'వెధవ. వీడికి ఎంత పొగరు?' అనుకుని బుసలు గొట్టుకుంటూ అక్కడ్నుంచి కదిలాడు సుబ్రమణ్యం.

కాలిక దెబ్బ బాగానే తగిలింది. జివ్వుమంటూ వుంది, దెబ్బతగిలిన చోట.

హోటల్ రేడియోలో ప్రాంతీయ వార్తలు వస్తున్నాయి. చాలా మంది గుంపుగా మూగి వున్నారు. అక్కడ. ప్రభుత్వ వుద్యోగుల వేతనాల స్కేళ్ళు పెంచారని వార్త. గుంపులు గుంపులుగా వుద్యోగులు ఆ విషయమే చర్చించుకుంటున్నారు. వుత్సాహంగా.

ఈ పాటికి తన 'రిజిగ్నేషన్ లెటరు' ఆఫీసరు దగ్గరికి వెళ్ళి వుంటుంది. ఆయన వెంటనే తన రిజిగ్నేషన్‌ని 'యాక్సెప్ట్' చేసి పైకి రిపోర్టు కూడా పంపివుంటారు. ఇంకెక్కడి వుద్యోగం? అంతా అయిపోయి వుంటుంది ఈపాటికి.

ఆనందరావు నలుగురు స్నేహితులతో కలిసి పే స్కేళ్ళ గురించే వుత్సాహంగా చర్చిస్తూ అటుగా వెళ్ళాడు. వెళ్తూ సుబ్రమణ్యం మీద వక వంకర చూపు విసిరేసి వెళ్ళాడు. వుండు మీద కారం రాసినట్టనిపించింది సుబ్రమణ్యాన్కి.

పళ్ళు పటపట కొరికాడు. కాలు దెబ్బ తగిలిన చోట తీపు పెట్టటం మొదలుపెట్టింది.

తిన్నగా డాక్టరు ఆచార్లు గారిదగ్గరకి వెళ్ళాడు.

ఆయన గాయానికి డ్రెస్సింగు చేసి కట్టుకడుతూ - 'దెబ్బ ఎలా తగిలిందండీ?' అని అడిగారు, యధాలాపంగా.

'ఈ ఆరాలన్నీ మీకెందుకు?' అని చిరాకు పడ్డాడు సుబ్రమణ్యం.

ఆయన సుబ్రమణ్యాన్ని ఆశ్చర్యంగా చూసారు.


'ఇదిగోండి మీ ఫీజు! తీసుకోండి. అంతేగాని - అనవసరమయిన ఇటువంటి ఆరాలు తీసి కొంపలు కూల్చే ప్రయత్నాలు చేయకండి' అని హెచ్చరించి- అయిదు రూపాయలు జేబులోంచి తీసి విసరి కొట్టాడు సుబ్రమణ్యం, కోపంగా.


'వక వైద్యుడుగా గాయం ఎలా అయిందో తెలుసుకోనడాన్కి నేను ప్రయత్నించటంలో కొంపలు కూల్చే ప్రయత్నాలు ఏమున్నాయండీ?' అన్నారు ఆచార్లు.

'అవన్నీ ఇక అనవసరం' అని అక్కడ్నుంచి కదిలి రామాలయం మండపం చేరి కూర్చున్నాడు సుబ్రమణ్యం. ఏం చేయాలో తోచటం లేదు.

కడుపులో కరకరలాడుతూవుంది. ఆలోచనలు ఈగల్లాగా ముసిరాయి.

ఆఫీసరు గదిలో మధ్యాహ్నం ఆ సంఘటన జరిగాక, సుబ్రమణ్యం మనసు మనసులో లేదు. ఆవేశం పెచ్చు మీరి కోపం తన్నుకు వచ్చింది. ఉద్రేకంలో యుక్తాయుక్త విచక్షణ నశించింది.



## శత్రువు

సూపర్నెంటు సూర్యారావుతో అనవసరంగానే ఘర్షనపడి తొందరపాటుతో రిజిగ్నేషన్ లెటరు రాసి, ఆయన మొహాన్న కొట్టాడు. ఆవుద్యోగం మళ్ళీ ఇప్పుడు కావాలంటే తల్లక్రిందులుగా తపస్సు చేసినా దొరకదు. కాంపిటీషన్ రోజులు మారాయి. చేజేతులా బంగారం వంటి వుద్యోగాన్ని నీళ్ళు వదులు కున్నాడు తను, ఆవేశంలో. పాపం సూర్యారావు ఎన్ని విధాలుగానో నచ్చచెప్ప జూశాడు. తనే వినలేదు. ఈ వుద్యోగం తప్ప తనకి మరి ఏ ఆధారం లేదు. తన మీద ఆధార పడి వున్న సంసారం, భార్య సుజాత ఎంతో మంచిది. శాంత స్వభావురాలు. అనురాగ మయమయిన అయిదేళ్ళ సంసారపు తొలి పంట మూడేళ్ళ బాబు. బొద్దుగా తొనలు కట్టిన పంటితో ముద్దు వస్తుంటాడు. అకారణంగా ఆ రోజు తన చేతిలో వాడి వీపు పేలింది. చంటిపిల్లలకేం తెలుసు?! దుమ్ములో ఆడకూడదన్న మాటనిజమే గానీ ఆ విషయం అవగాహన చేసుకోగలిగిన వయస్సు కాదు వాడిది.

ఆ వుద్రేకంలో తను ఎంతో ప్రేమించే సుజాతను కూడా క్రూరంగా తోసి పారేసి వీధిన పడ్డాడు. సంసారం పెట్టిన కొత్తలో నూరు రూపాయలు పెట్టి చేయించాడు ఆకుర్చీని, 'గెస్టులు' వస్తే కూర్చుంటారని. ఎంత మంచి కర్ర! ఎంత చక్కని పనితనం! పిచ్చి కోపంతో తను కసిగా తన్ని దాన్ని విరగ్గొట్టి ఏం సాధించినట్టు?! అది ముక్కలయి పోయి పనికి రాకుండా పోయింది. వందరూపాయలూ పోయింది! కాలికి గాయమయింది. పైగా వైద్యానికి అయిదు రూపాయలు వదిలింది. చిన్నస్వామితోను, ఆచార్యులతోనూ అకారణ వైరం కొని తెచ్చు కున్నాడు. టీ అవసరం లేదని చిన్న స్వామితోను, ఏదో యాక్సిడెంటయిందని ఆచార్యులతోనూ చెప్పి వుంటే తన గౌరవం నిలిచివుండేది. అందువలన పోయేదేమీ వుండేది కాదు!

మరి – ఇదంతా ఇట్లా ఎందుకు జరిగింది?! తను అట్లా ఎందుకు ప్రవర్తించినట్టు? స్వతహాగా, ఆఫీసరు దుష్టుడు కాదు. ఆఫీసరు అన్నాక అయిన అనకా తప్పదు. తనలాంటి వాళ్ళు పడకా తప్పదు. ఆయనకి నోరు దురుసే గాని హృదయం మంచిది. ఆఫీసులో అందర్నీ కుటుంబ సభ్యులుగా చూసుకుని గతంలో ఎన్నోసార్లు ఆయన వుదారంగా ప్రవర్తించటం తనకీ తెలుసు! అన్నీ తెలిసీ – తను అలా ఎందుకు ప్రవర్తించినట్టు? ఏం చేద్దామనీ? కిళ్ళీ కొట్టు పెట్టుకుందామనా? సూర్యారావు అన్నట్టు అది తనకి చేతనయిన పనియేనా?

చీకటి పడింది. సుబ్రమణ్యం దిగాలు పడ్డాడు. నీరసంగా మూలిగాడు.

బజార్లలో లయిట్లు వెలిగాయి. పునరాలోచన సుబ్రమణ్యాన్ని తన తప్పుని విడమర్చి చూపింది. రామాలయం మండపం దగ్గర్నుంచి సుబ్రమణ్యం కాళ్ళు చరచరా కదిలాయి. అప్రయత్నంగానే సుబ్రమణ్యం ఆఫీసు మెట్లెక్కాడు. ఆఫీసులో లయిట్లు ఇంకా దేదీప్య మానంగా వెలుగు తున్నాయి! వాచ్ మన్ స్టూలు మీద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

ఆఫీసరు గదిలో ఆఫీసరూ, సూపర్నెంటు సూర్యారావూ ఫైళ్ళు ముందు వేసుకుని పరపరా రాసుకుంటున్నారు. దీక్షగా పని చేసుకుంటున్నారు.

'అడుగో సుబ్రమణ్యం వచ్చేసాడు! రావయ్యా, రా, కూర్చో' అని పలకరించాడు సూర్యారావు, స్నేహంగా నవ్వుతూ.

'నీ కోసమే చూస్తున్నామయ్యా! నీ చెయ్యి కూడా పడితే గానీ ఈ పని పూర్తయ్యి, రేపటికి 'ఇన్స్పెక్షన్ మెటీరియల్' రెడీ అయ్యేటట్టు లేదు. రా.' అని ఆహ్వానించాడు ఆఫీసరు, సుబ్రమణ్యాన్ని. మారు ఆలోచన లేకుండా పనిలోకి చొరబడ్డాడు సుబ్రమణ్యం. ముగ్గురూ కూర్చుని మధ్యలో మూడు సార్లు టీలు తెప్పించుకుని త్రాగి పని పూర్తి చేసేటప్పటికి రాత్రి పన్నెండయింది! అయితేనేం? పని పూర్తయిందన్న తృప్తి మిగిలింది! వద్దన్నా వినకుండా, సూర్యారావునీ, సుబ్రమణ్యాన్నీ ఇళ్ళ దగ్గర తన కారులో దింపి– తను ఇంటికి వెళ్ళాడు ఆఫీసరు. వాళ్ళ ఇళ్ళు దగ్గర దగ్గరే! 'ఇక నేను వస్తాను సార్' అన్నాడు సుబ్రమణ్యం.

'సుబ్రమణ్యం! ఇదుగోనయ్యా, నీ కాగితం నువ్వు తీసుకో' అని జేబులోంచి తీసి అందించాడు సూర్యారావు నవ్వుతూ. కొంపదీసి అది తన రిజిగ్నేషన్ యాక్సెప్టెన్సు లెటరు కాదు గదా! 'ఏమిటి సార్ అది?!' గజగజ లాడాడు సుబ్రమణ్యం.

'అదేనయ్యా, నీవు మధ్యాన్నం, మహావీరావేశంలో పరపరా రాసేసి నా మొహాన్న కొట్టావే! అదే! నీ 'రిజిగ్నేషన్ లెటర్.'– అని నవ్వాడు సూర్యారావు. వణుకుతూన్న చేతులతో దాన్ని అందుకుని ముక్కలుగా చింపేస్తూ– 'కోపంతో పిచ్చి పని చేసాను సార్. మొత్తానికి ఇది ఆఫీసరు గారి దాకా పోకుండా ఆపి మీ దగ్గర పెట్టుకుని, నాకు ఎంతో మేలు చేసారు మీరు! చాలా థాంక్సండీ.' అన్నాడు సుబ్రమణ్యం, కృతజ్ఞతగా.

'నీ రిజిగ్నేషన్ లెటరు ఆఫీసరు గారి దగ్గరకి ఎందుకు వెళ్ళలేదూ? వెళ్ళిందయ్యా. కానీ ఆయన దాన్ని చూసి నవ్వి తిరిగి నా కిచ్చేసారు! ఇచ్చి– ఏమన్నారో తెలుసా?'

సుబ్రమణ్యం ప్రాణ్నుడిపోయాడు! 'ఏమన్నారు సార్?' అనడిగాడు. 'కోపం మనిషికి గొప్ప శత్రువు'! మన సుబ్రమణ్యం తన శత్రువు చేతిలో చిక్కి ఇటువంటి పని చేసి వుంటాడు! ప్రశాంతంగా ఆలోచించుకుని, తిరిగి తన నిర్ణయాన్ని పునః పరిశీలించుకునే అవకాశం అతనికివ్వటం మన ధర్మం'– అన్నారు. అందుకే నీ లెటరు నిన్ను క్షేమంగా చేరింది. ఇక నీ ఇష్టం'– అని నవ్వాడు సూర్యారావు. సుబ్రమణ్యం కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి.